# పడిగాపులతో పరేషాన్

- ఆగిన ఇంటి వద్దకే రేషన్ బండి
- డిపోల వద్ద ప్రజల ఇబ్బందులు



రేషన్ షాపు వద్ద క్యూలో లబ్ధిదారులు

**సీటీఆర్ఐ:** ఇంటింటికే రేషన్... ఈ మాట వినడానికి ఎంతో బాగుంది. దీనిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిజం చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేస్తోంది.. ఇంటింటికీ రేషన్ సరకులు ఇచ్చే ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో మళ్లీ కష్టాలను తెరపైకి తెచ్చింది. తిరిగి రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు పడే రోజులను తీసుకువచ్చింది. రేషన్ బియ్యం కోసం బుధవారం కూడా లబ్ధిదారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ముఖ్యంగా క్యూలో నిలబడలేక తీవ్ర అవస్థలకు గురయ్యారు. సర్వర్ పనిచేయకపోవడం, గంటలు తరబడి నిలబడాల్సి రావడంతో ఎండదెబ్బకు ప్రజలు నరకం చూశారు. గతంలో ఇంటి వద్దకే వచ్చి సరకులు పంపిణీ చేసేవారని, ఇప్పుడు క్యూలో నిలుచుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కూటమీ ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్నారు.

**ఇంటి వద్దకు వస్తాయని అనుకుని..**

నగరంలోని శివారు ప్రాంతాలైన 40 నుంచి 50వ డివిజన్లలో రేషన్ లబ్ధిదారులు ఇంటికే రేషన్ వస్తోందని అనుకుంటున్నారు. ఇందులో చాలా మందికి రేషన్ డీలర్ ద్వారా బియ్యం పంపిణీ జరుగుతుందని తెలియలేదు. ప్రతి నెలా మాదిరిగా 7వ తేదీ లోపు రేషన్ బండి రాలేదని వేచిచూస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని లబ్ధిదారులకు రేషన్ డీలర్ షాపు ఎక్కడో ఉందో కూడా తెలియదు. 49వ డివిజన్‌లోని సుబ్బారావు నగర్ పరిధికి చెందిన రేషన్ లబ్ధిదారులకు సుమారు ఒక కిలో మీటర్ దూరంలో మున్సిపల్ స్కూల్ వద్ద డిపో ఏర్పాటు చేశారు. అక్కడకు వెళ్లి రేషన్ తెచ్చుకోలేక నానా అవస్థలు పడుతున్నారు.

**ఒక రోజు పని పోతోంది**



ఇంటి వద్దకే వచ్చి రేషన్ అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేయడం వల్ల సామాన్యులు రేషన్ తెచ్చుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. కూలి పని చేసుకునే ఎక్కువ మంది ఉండే క్వారీ ప్రాంతంలో రేషన్ తెచ్చుకోవాలంటే ఒక రోజు పనిపోతుంది.

– గారా చంటిబాబు, స్థానికుడు

**క్యూలో నిలుచుని..**



రేషన్ షాపుల వద్ద క్యూలో నిలుచుని రేషన్ తీసుకోవడానికి చాలా సమయం పడుతుంది. అంతేకాకుండా మా ఇంటికి రేషన్ షాపునకు చాలా దూరం ఉండటంతో బియ్యం తెచ్చుకోవడం చాలా ఇబ్బంది అవుతుంది. సమస్యను అధికారులు పరిష్కరించాలి.

– జి.దయామణి, స్థానికురాలు

## క్లుప్తంగా

### రైతుబజార్ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన



రైతు బజార్ నిర్వహణను ఎస్టేట్ అధికారి భాస్కర్‌ను అడిగి తెలుసుకుంటున్న విద్యార్థులు

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** స్థానిక నటరాజ్ థియేటర్ రైతుబజార్‌ను గురువారం జీఎస్‌కేఎం లా కళాశాల విద్యార్థులు, ప్రముఖ నేత్ర వైద్యుడు, ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షుడు డాక్టర్ వీకే రాజు సందర్శించారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ భాస్కర్ వారికి రైతులకు, వినియోగదారులకు రైతు బజారు ఏ విధంగా ప్రయోజనకరంగా ఉంటుందో వివరించారు. లా విద్యార్థులు తమ న్యాయ విద్యా ప్రణాళికలో భాగంగా రైతు బజార్ తీరు తెన్నులను, పరిపాలనా విధానం అమలు తెలుసుకున్నారు. ఈ రైతు బజార్‌లో తూనికలు కొలతలు, కూరగాయల ధరలు ఇతర వివరాలను వినియోగదారులను, రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదనరావు, సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు రఘునాథ్ పాల్గొన్నారు.

### వృద్ధులకు పింఛన్ల పంపిణీ



వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

**సీటీఆర్ఐ:** వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆనంద్ గార్డెన్స్‌లో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు ఆధ్వర్యంలో ద్వారకా తిరుమల దేవస్థానం బోర్డు మాజీ సభ్యురాలు కె.విజయలక్ష్మి 80 మంది వృద్ధులకు రూ.500 చొప్పున రూ.40 వేలు అందజేశారు. క్లబ్ అభివృద్ధికి దాతలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వృద్ధులకు అల్పాహారం అందజేశారు. అనంతరం పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు, క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవాని, సామాజికవేత్త నల్లబంతు రాజ్యలక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయిని రామదేవు హేమవల్లి, రూపశ్రీ శివలక్ష్మి, దేవీప్రియ ఇండస్ట్రీస్ అధినేత ఎస్.దుర్గా ప్రసాద్, సామాజికవేత్త కంటిపూడి శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### వినియోగదారుల విశ్వాసంతోనే అభివృద్ధి

**బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం మనోజ్ శ్రీవాస్తవ**

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులు చూపిన విశ్వాసం, మద్దతు తమ బ్యాంకు అభివృద్ధికి కీలకమని బ్యాంక్ జీఎం మనోజ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. గురువారం స్థానిక షెల్టాన్ హోటల్‌లో రాజమండ్రి క్లస్టర్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ ఔట్ రీచ్ కార్యక్రమం–సత్కార వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జీఎం మనోజ్ శ్రీవాస్తవ, జోనల్ మేనేజర్ నికేష్ కుమార్ సిన్హా, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్.సీతారామ్ బ్యాంకు వినియోగదారులను సత్కరించారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



జిల్లా కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ముందుగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా వచ్చిన ప్రాథమిక హక్కులే కాకుండా ప్రకృతిని కాపాడే చర్యలు తీసుకోవాలన్నారు. సగటున ప్రతి ఇంట్లో విద్యుత్, నీరు, వంట గ్యాస్ దుర్వినియోగం చేస్తున్నట్టు అధ్యయనాలు చెప్తున్నాయని, అలా ప్రకృతి వనరులను దుర్వినియోగం చేయకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలన్నారు. భవనాలను కూల్చేటపుడు చెట్లు దెబ్బతినకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నది నినాదాలకే పరిమితం కాకూడదని అందుకు తగ్గ కార్యాచరణ ఉండాలన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వక్తృత్వ, చిత్ర లేఖన పోటీల్లో విజేతలకు జిల్లా జడ్జి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, పాఠశాలల అర్బన్ రేంజి డీఐ బి.దిలీప్ కుమార్, పాఠశాల హెచ్ఎం, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మొక్కల పెంపకం అలవాటు కావాలి**



ఎస్‌కేవీటీ స్కూలులో మొక్క నాటుతున్న డీఐ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు

**కంబాలచెరువు:** పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అర్బన్ రేంజి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన పాల్గొని విద్యార్థులు వీలైనన్ని మొక్కలను నాటాలని సూచించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధి బి.విజయకుమారి, భారత్ స్కౌట్స్ ప్రతినిధి వరహాగిరి కృష్ణమోహన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

**కడియంలో..**



కడియంలో పక్షుల కోసం వరికుచ్చులు కడుతున్న ఎంపీపీ సత్యప్రసాద్ తదితరులు

**కడియం:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ పక్షులకు వరికుచ్చులు కట్టి, వాటికి నీటి కుండీలు ఏర్పాటు చేశారు. అలాగే మొక్కలు నాటారు. కార్యక్రమంలో పర్యావరణ మిత్ర పురస్కార గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, టి.కృష్ణమోహన్, అడపా సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కార్యాలయ ఏవో సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దామిరెడ్డిపల్లిలో మండల జనసేన అధ్యక్షులు ముద్రగడ జెమి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

### వృక్షమిత్ర మాటూరి



సిద్ధార్థ నాటిన 16 అడుగుల గానుగ చెట్టు

**కంబాలచెరువు:** రాజమండ్రి రైజింగ్ సంస్థ నిర్వాహకుడు మాటూరి సిద్ధార్థ నగరంలో 289 చెట్లను నాటి వాటిని సంరక్షిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వృక్ష మిత్ర మాటూరి సిద్ధార్థను గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ వృక్ష ప్రేమికులు మొక్కలు నాటితే, తాను చెట్లను నాటుతున్నానని తెలిపారు. తాను మెయిన్‌రోడ్ కోటగుమ్మం సెంటర్ వంటి ప్రాంతాల్లో నాటిన చెట్ల కింద చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకోవడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా 16 అడుగుల పెద్ద గానుగ చెట్టును నాటామన్నారు. ప్రతి ఒక్కరూ తన వంతు బాధ్యతగా మొక్కలను పెంచడం అలవాటు చేసుకుంటే అదే పుడమి తల్లికి ఇచ్చే విలువైన అభరణం అవుతుందన్నారు.

### యోగసాధనతో సంపూర్ణ ఆరోగ్యం

**జేసీ చిన్న రాముడు**

**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం):** యోగ సాధనకు ఉదయమే మంచి డ్రెస్ కోడ్‌తో సిద్ధమైతే మరింత ఉత్సాహంగా ఉంటుందని జేసీ చిన్న రాముడు అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో గ్రాండ్ ట్రంక్ రోడ్డు మార్గంలో జిల్లా స్థాయి యోగాంధ్రలో పదో రోజు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జూన్ 21వ తేదీ వరకు నిర్వహించే యోగ సాధన మాసోత్సవాల్లో భాగంగా నిత్యం ప్రజలు యోగ సాధన చేయాలని కోరారు. దీని వల్ల శరీరం ఎంతో ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా ప్రజలందరూ స్వచ్ఛందంగా కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఆర్టీఐహెచ్ ఏర్పాట్ల పరిశీలన



ఆర్టీఐహెచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్, ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం రూరల్:** ఈ నెల 10 లేదా 11 తేదీల్లో ధవళేశ్వరం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబుచే ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం సాయంత్రం ఈ భవన ఏర్పాటు పనులను నగర కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎస్పీ డి.నరసింహకిషోర్‌లతో కలిసి పరిశీలించి పనుల వేగవంతంపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ హబ్ నిర్వహణలో గ్రీన్ కో ఎనర్జీ, ఓఎన్జీసీ, గెయిల్, అవంతి తదితరులు ప్రమోటర్లుగా ఉంటారని ఆమె వెల్లడించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాజమండ్రి రూరల్ నియోజక వర్గం పరిధిలో ఈ హబ్ ఏర్పాటుపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

**వారొస్తే వృక్ష విలాపమే!**



**రాజమహేంద్రవరం రూరల్:** సీఎం చంద్రబాబునాయుడు రాజమహేంద్రవరం రూరల్ పర్యటన నేపథ్యంలో హబ్ ప్రారంభోత్సవ స్థలంలో భారీ చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజునే ఈ పనులు మొదలు పెట్టడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. పర్యావరణ దినోత్సవ వేదికపైనే చంద్రబాబు గత ప్రభుత్వంపై చెట్లు తొలగించేశారంటూ విమర్శలు గుప్పించారు. స్వయంగా ఆయన పర్యటన నేపథ్యంలో చెట్ల కొమ్మలు తొలగించడంపై ఏమంటారో మరి!

# విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈవో వాసుదేవరావు. చిత్రంలో పల్ల వెంకన్న కుటుంబ సభ్యులు

**కడియం:** పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వారి కుమారులు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, గణపతి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులైన 11 మంది చిన్నారులకు రూ.లక్ష నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పల్ల వెంకన్న జయంతిని పురస్కరించుకుని కడియపులంక జాతీయ రహదారి పక్కన ఉన్న ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ కె.వాసుదేవరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ పురస్కారాలను అందజేశారు. ముందుగా వెంకన్న విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవా స్ఫూర్తిని వారసత్వంగా తీసుకుని కొనసాగిస్తున్న కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించిన హెచ్ఎంలు బి.సుధ, జయలక్ష్మి, టి.సత్యనారాయణ, వీవీ ప్రసాదరావు, జి.సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. దివ్యాంగులకు రూ.90 వేల విలువైన ట్రైసైకిళ్లను ఇద్దరికి అందజేసినట్టు వెంకన్న కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నర్సరీ రంగ ప్రముఖులు మార్గాని సత్యనారాయణ, ఈలి గోపాలం, తిరుమలశెట్టి శ్రీనివాస్, యార్లగడ్డ జగదీశ్వరరావు, మండలాలలోని ఉపాధ్యాయులు, వెంకటేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

**కడియం:** మండల శివార్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. అలాగే పలు పనులను ఆయన ప్రారంభించారు. ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, బొరుసు సురేష్, జల్లి కృపారావు తదితరులు పాల్గొన్నారు.

### గోదావరిలో మృతదేహం లభ్యం

**కంబాలచెరువు:** స్థానిక గోదావరి నది ధోబీ ఘాట్ వద్ద గురువారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మండపేట మండలం ద్వారపూడికి చెందిన ఎం.వీరబాబు (40)గా పోలీసులు గుర్తించారు. ఈ నెల 4న రాజమహేంద్రవరంలోని తన మేనల్లుడు వినోద్‌కుమార్‌కు ఇంటికి వస్తున్నానని ఫోన్ చేసి చెప్పాడు. అయితే అతను ఇంటికి రాలేదు. కాగా ధోబీఘాట్ వద్ద మగ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దాన్ని వెలికితీసి దర్యాప్తు తీశారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ సమాచారాన్ని పోలీసులు వాట్సాప్ గ్రూప్‌ల్లో పెట్టగా వీరబాబు కోసం గాలిస్తున్న అతని కుటుంబీకులకు విషయం తెలిసి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఆధారాలు అందజేసారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు. ద్వారపూడిలో దుస్తుల వ్యాపారం చేసే వీరబాబు అప్పులపాలు కావడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 171 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన ఆదిత్య కళాశాల విద్యార్థులు

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ సెలక్షన్లలో 171 మంది ఉద్యోగాలు సాధించారని ఆ విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి గురువారం తెలిపారు. ఆదిత్య విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని, ఐటీ రంగంలో టీసీఎస్ కంపెనీకి 122 మంది, కాగ్నిజెంట్ కంపెనీలో 49 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రస్తుత విద్యార్థులు విజయాలు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్‌కే రెహమాన్, చంద్రశేఖర్ అభినందించారు.

**మొక్కలు నాటిన విద్యార్థులు**

**కంబాలచెరువు:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సరస్వతీ ఘాట్ సమీపంలోని ఏపీ టూరిజం కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలోని కలుపు మొక్కలను, వ్యర్థ పదార్థాలు, ముళ్ల మొక్కలను తొలగించి, మామిడి, పనస మొక్కలను నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జీవీఎన్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, పోలుకొండ సాయి, కె.మహేశ్వరి, ఎన్ఎస్ఎస్ నాయకులు సూర్య, వినయ్, సుమ, యశస్వి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా విజయ కనకదుర్గ ఆలయ పునర్నిర్మాణం



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

**రాజమహేంద్రవరం రూరల్:** మోరంపూడి శ్రీసాయిచైతన్యనగర్‌లో కొలువైన విజయ కనకదుర్గాదేవి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆలయ అధ్యక్షుడు మేడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో బుధవారం శంకుస్థాపన చేశారు. కరిబండి సతీష్ కుమార్ దంపతులు పునర్నిర్మాణ పనులకు తొలి పూజ చేశారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్టు త్రిమూర్తులు తెలిపారు. సుమారు రూ.50 లక్షలతో ఆలయాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్రహౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఆలయ గౌరవ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**కడియం:** వేమగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని జేగురుపాడు ఫీడర్‌కు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈ శాఖ ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. మండలం పరిధిలోని జేగురుపాడు, చైతన్యనగర్ ఇండస్ట్రియల్ కాలనీలకు సరఫరా నిలిచిపోతుందని, ఈ మేరకు వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

### యువకుడి అదృశ్యం



నాగేశ్వరరావు (ఫైల్)

**రాజమహేంద్రవరం రూరల్:** తనను ఆటో ఎక్కించి ఇంటికి వెళ్లిన తన భర్త కనిపించడం లేదని వీరభద్రపురం ఆవరోడ్ వాంబే కాలనీకి చెందిన ఆగ్రవరపు దుర్గ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం వాంబేకాలనికి చెందిన 25 ఏళ్ల బట్టు నాగేశ్వరరావు తాపీపని చేస్తుంటాడు. అతని భార్య దుర్గ ఇళ్లల్లో పనులు చేస్తుంది. ఈనెల 3వ తేదీ ఉదయం 8 గంటలకు దుర్గను పనికి ఆటో ఎక్కించి నాగేశ్వరరావు ఇంటికి వెళ్లిపోయాడు. దుర్గ పని ముగించుకుని ఉదయం 11 గంటలకు ఇంటికి రాగా తన భర్త కనిపించ లేదని, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉపసర్పంచ్ ఎన్నికలో వీగిన అవిశ్వాసం

**కడియం:** మండలం కడియపులంక పంచాయతీ ఉప సర్పంచ్ పదవిపై గురువారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. కూటమికి చెందిన వార్డు సభ్యులు అవిశ్వాసానికి వెళ్లగా వైఎస్సార్ సీపీ సభ్యుల మద్దతుతో ఉప సర్పంచ్ పదవిని పాటంశెట్టి రాంజీ నిలబెట్టుకున్నారు.

2021లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి సర్పంచ్‌గా మార్గాని అమ్మాణ గెలుపొందారు. అలాగే 18 మంది వార్డు సభ్యులకు 13 మంది కూటమి పార్టీల నుంచి గెలుపొందారు. వైఎస్సార్ సీపీ నుంచి ఐదుగురు వార్డు సభ్యులుగా గెలిచారు. ఉప సర్పంచ్‌గా పాటంశెట్టి వెంకట్రామారావు (రాంజీ)ని ఎన్నుకున్నారు. అయితే రెండేళ్ల క్రితం సర్పంచ్ అమ్మాణి ఆకస్మిక మృతితో ఉప సర్పంచ్‌గా ఉన్న రాంజీకి ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించారు. అయితే ఆ తరువాత ఏర్పడిన పరిణామాల నేపథ్యంలో కూటమి పార్టీల్లో లుకలుకలు మొదలై రాంజీని పదవి నుంచి దించి, మరొకరిని ఉప సర్పంచ్‌గా గెలిపించి, ఇన్‌చార్జి సర్పంచ్ బాధ్యతలు అప్పగించాలని కూటమి నాయకుల ప్రోద్బలంతో పావులు కదిపారు. ఆర్డీవో కృష్ణనాయక్ ప్రత్యేకాధికారిగా డీపీవో ఎం.నాగలత, ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో ఎ. శ్రీనివాసరావుల సమక్షంలో కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు భారీ బందోబస్తు మధ్య ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించారు. ఉప సర్పంచ్‌గా రాంజీకి కూటమి వార్డు సభ్యులు ఇద్దరు మాత్రమే మద్దతు ఇచ్చారు. అయితే వైఎస్సార్ సీపీకి చెందిన నలుగురు వార్డు సభ్యులు రాంజీకే మద్దతు తెలపడంతో మొత్తం ఏడుగురి మద్దతు లభించింది. దీంతో కూటమి నుంచి 12 మంది వార్డు సభ్యులు చేతులెత్తి వ్యతిరేకించినప్పటికీ ఫలితం లేకపోయింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఉప సర్పంచ్‌గా గెలుపొందడానికి ఒక్క ఓటు మెజార్టీ ఉంటే సరిపోతుంది. కానీ అవిశ్వాసం ద్వారా దించడానికి హాజరైన సభ్యుల్లో 2/3వ వంతు మెజార్టీ లేకపోవడంతో ఉప సర్పంచ్ రాంజీపై అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రత్యేకాధికారి కృష్ణనాయక్ ప్రకటించారు. దీంతో కూటమి నాయకుల ప్రయత్నాలకు గండిపడింది.

# గోదావరి ఘాట్ విగ్రహాలు భద్రమే

- ఒకవేళ పాడైనా కొత్తవి ఏర్పాటు
- రివర్ ఫ్రంట్‌తో వాటికి ఇబ్బంది లేదు
- పిండాల రేవుకు ఆటంకం కలగదు
- రాజమండ్రి వారసత్వ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అఖిల పక్ష నేతల ఉద్ఘాటన



సమావేశంలో పాల్గొన్న మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, టీకే విశ్వేశ్వరరెడ్డి తదితరులు

**రాజమహేంద్రవరం సిటీ:** గోదావరి గట్టుపై ఉన్న మహనీయుల విగ్రహాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పేపర్ మిల్లు వద్ద కృష్ణ సాయి కల్యాణ మండపంలో రాజమండ్రి వారసత్వ సంపద పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది మద్దూరి శివ సుబ్బారావు అధ్యక్షత రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో గోదావరి గట్టుపై ఉన్న మహనీయుల విగ్రహాలకు అవమానం జరగరాదన్నారు. విగ్రహాల పరిరక్షణకు పార్టీలకు అతీతంగా కృషి చేయాలన్నారు. విగ్రహాలను యథాతథంగా ఉంచేలా చర్యలు చేపట్టి అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్‌ను ఆనుకుని ఉన్న ప్రదేశంలో సర్వీస్ రోడ్డు వేయాలని, అలాగే ఫ్లై ఓవర్‌పై వీధి దీపాలు వేయాలని, పెరుగుతున్న జనాభా మేరకు వేమగిరి జంక్షన్ నుంచి దివాన్‌చెరువు లోపల అవసరమైన చోట ఫ్లైఓవర్లు వేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి గట్టు సుందరీకరణ పేరుతో రివర్ ఫ్రంట్ నిర్మాణం జరుగుతున్న క్రమంలో అక్కడి విగ్రహాలను తొలగించబోమని స్పష్టం చేశారు. విగ్రహాల ఏర్పాటులో ఏవైనా పాడైతే కొత్తవి ఏర్పాటు చేస్తామని వివరించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణం వల్ల పిండాల రేవు ఉనికికి ఎలాంటి ఇబ్బంది లేకుండా గోశాల పక్కన ఉన్న స్థలంలో అపర కర్మల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు.

పురోహితుల వృత్తికి గానీ, శ్రాద్ధ కర్మలు నిర్వహించే వారికి కానీ రివర్ ఫ్రంట్ వల్ల సమస్య రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

హేవ్ లాక్ వంతెనను చారిత్రక, పర్యాటక ప్రాంతంగా చేసేందుకు రూ. 100 కోట్లతో టెండర్ పూర్తయ్యిందని, దానికి అనుబంధంగా రూ.50 కోట్లతో ఘాట్లను అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కేంద్ర కార్యాలయాన్ని రాజమహేంద్రవరానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు లక్షల సంఖ్యలో యాత్రికులు రానున్నందున, ఆ మేరకు వేగంగా నగర అభివృద్ధి జరగాలంటే, కార్పొరేషన్ ఎన్నికలు వెంటనే జరిపించాలని డిమాండ్ చేశారు. బొమ్మూరులో నిర్మితమైన సైన్స్ మ్యూజియంను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, పంతం కొండలరావు, పరిరక్షణ సమితి కార్యవర్గ సభ్యులు దేశి రెడ్డి బలరామ నాయుడు, విగ్రహాల పరిరక్షణ కన్వీనర్ మాదేటి రవి ప్రకాష్, ఆంధ్ర కేసరి యువజన సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కానుబోయిన సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రవీణ్ సంస్మరణ సభకు హైకోర్టు అనుమతి

**రాజమహేంద్రవరం సిటీ:** హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు హైకోర్టు లైన్ క్లియర్ చేసిందని, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తరఫు న్యాయవాది బాల గురువారం విలేకర్లకు తెలిపారు. గత నెల 24న ప్రవీణ్ పడగాల సంస్మరణ సభ నిర్వహించేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో హర్షకుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా న్యాయవాది బాల హైకోర్టులో వాదనలు వినిపిస్తూ.. మే 28న కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడుకు అనుమతి ఇచ్చారని, అటువంటిది సామాన్య ప్రజలు సంస్మరణ సభ నిర్వహించేందుకు అనుమతులు నిరాకరించారని ప్రస్తావించారు. వాదనల అనంతరం, ప్రవీణ్ సంస్మరణ సభకు సంబంధించి కొత్తగా చేసే దరఖాస్తుపై నాలుగు వారాల్లో ఏదో ఒక రోజు అనుమతివ్వాలంటూ జిల్లా ఎస్పీని ఆదేశించిందని బాల తెలిపారు. సభ అనుమతుల కోసం త్వరలోనే జిల్లా పోలీసు కార్యాలయంలో దరఖాస్తు చేస్తానని, ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో సభ నిర్వహిస్తామని హర్షకుమార్ తెలిపారు.